నమస్తే తెలంగాణ

నిజామాబాద్

5 | నిజామాబాద్, ఆదివారం 25 మే 2025 | NIZAMABAD


## నెమళ్లపై అటవీ శాఖ నిర్లక్ష్యం

నెమలి భారతదేశ జాతీయ పక్షి. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 కింద సంరక్షిత జాతిగా గుర్తించారు. ఈ చట్టం ప్రకారం నెమలికి హాని కలిగించడం, వేటాడడం, బంధించడం, దాని ఈకలను వాణిజ్య అవసరాలకు కోసం ఉపయోగించడం నేరంగా పరిగణించబడుతుంది. సెక్షన్ 51(1ఏ) ప్రకారం నెమలికి హాని తలపెడితే శిక్షార్హమైన నేరం అవుతుంది. గరిష్ఠంగా ఏడేండ్ల వరకు జైలుశిక్షతోపాటు జరిమానా విధించే వీలుంది. నెమళ్లను అడవులు, అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాల్లో సంరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వివిధ కారణాలతో పూలాంగ్ వాగు వెంట నెమళ్ల ఆవాసాలు అనేకం ధ్వంసం కావడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పలు సందర్భాల్లో ఆవాసాలు లేక అనుమానితుల సంచారంతో బెదిరిపోతున్నాయి. దారి తప్పి గృహ నివాసాలపైకి వచ్చేస్తున్నాయి. వాగు వెంట అనేక కాలనీల్లో నెమళ్లు సంచరిస్తూ భద్రత లేకుండా పోతున్నాయి. నెమళ్లు ఫాసియోనిడే కుటుంబానికి చెందినవి. వైవిధ్యతలో అనేక ప్రత్యేకతలున్నాయి. పురుష నెమళ్లు రంగురంగుల ఈకలు, పొడవైన తోకలతో ఆకర్షణీయంగా పూలాంగ్ వెంట విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆడ నెమళ్లు సాధారణ గోధుమ రంగు ఈకలతో నిరాడంబరంగా అధిక సంఖ్యలో ఉన్నాయి. ఈ వైవిధ్యత సంతానోత్పత్తిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నప్పటికీ వీటి సంరక్షణకు చర్యలు లేకపోవడం, ఆవాసల విధ్వంసం మూలంగా ఈ వైవిధ్యతతకు ముప్పు ఉంది. నెమళ్లు భారతీయ సంస్కృతిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగి ఉండగా అటవీ శాఖ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పూలాంగ్ వాగు పరీవాహక ప్రాంతంలో నెమళ్ల సందడి

- స్థిర ఆవాసం లేకపోవడంతో ఆగమాగం
- పులాంగ్ వాగు వెంట కానరాని మయూరం
- ఇష్టారీతిన నిర్మాణాలతో వన్యప్రాణికి భారీ ముప్పు
- రోజురోజుకూ కనుమరుగవుతున్న నెమళ్ల సంతతి
- పట్టించుకోని అటవీ శాఖాధికారులు

కరువైన భద్రత

# జాతీయపక్షి జాడేదీ?



నిజామాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జాతీయ పక్షికి భద్రత కరువైంది. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ వాగు ఆవాసంగా కుప్పలు తెప్పలుగా సంచరించేవి. ప్రస్తుతం వాగును అనుకొని నిర్మాణాలు చేపట్టడంతో నెమళ్లు ఆగమాగమవుతున్నాయి. పులాంగ్ వాగును డ్రైనేజీ డంప్‌గా మార్చడం కూడా జాతీయ పక్షి ఆయువు తీస్తోంది. ఇబ్బడి ముబ్బడి చర్యలతో నెమళ్లు తమ ఆవాసాలను కోల్పోతుండడంతో వాటి సంఖ్యలో రోజురోజుకూ తగ్గుతోందని స్థానికులు చెబుతున్నారు. పూలాంగ్ వాగు వానాకాలంలో సువిశాలంగా ప్రవహిస్తుంది. నగరానికి అందమైన జల హారంగా కనిపిస్తుంది. జిల్లా కేంద్రానికి తూర్పు భాగమంతటినీ స్పృశిస్తూ పూలాంగ్ వాగు ఉత్తర దిక్కున ముందుకు కదులుతుంది. విశాలమైన ఈ వాగు దారి పొడవునా దట్టమైన చెట్లతో గతంలో కనిపించేది. వివిధ కారణాల మూలంగా కళావిహీనంగా మారిన వాగుతో జాతీయ పక్షి సంచారానికి ప్రమాదం వచ్చి పడింది. నెమళ్ల సందడితో ఒకప్పుడు ఆహ్లాదానికి కేరాఫ్‌గా నిలిచిన పూలాంగ్ వాగు చుట్టూ పంట పొలాలు, నెమళ్ల కిలకిల రావాలు లేకపోవడంతో మూగబోతోంది. సాంకేతికంగా వాగుల పరిధి ఇరిగేషన్ శాఖకు చెందుతున్నప్పటికీ వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత అటవీ శాఖకు ఉన్నా పట్టించుకున్న దాఖాలాలులేవు. దీంతో నెమళ్ల సంతతికే ప్రమాదం ఏర్పడింది.

నిజామాబాద్ నగరం చుట్టూ పాంగ్రా వాగు, పులాంగ్ వాగులు సరిసమానంగా ప్రయాణం చేస్తాయి. నగరానికి ఆగ్నేయ దిక్కు నుంచి చొచ్చుకుని వస్తూ నగరానికి తూర్పు దిశగా జలహారంగా ఏర్పడి ఉత్తర వైపునకు దిశను మార్చుకుంటాయి. పాంగ్రా వాగు కొద్ది దూరం ప్రయాణించిన తర్వాత విజయ్ థియేటర్, ఎల్లమ్మగుట్ట సమీపంలోని మురికి నీటి శుద్ధి కేంద్రం వద్ద పులాంగ్ వాగుతో సంగమిస్తుంది. పూలాంగ్ వాగు ఇక్కడి నుంచి జన్నేపల్లి మీదుగా గోదావరిలో కలుస్తుంది. కొన్ని వందల కిలో మీటర్లు ప్రయాణం చేసే ఈ వాగు ఒకప్పుడు నెమళ్లకు రక్షిత కవచంగా ఉండేది. రోజురోజుకూ నగరం విస్తరించడం, జనావాసాలు పెరగడంతో వ్యర్థాలు విపరీతంగా డంప్ కావడం, వాగు విస్తీర్ణం తగ్గిపోవడం, మానవ కార్యకలాపాలు పెరిగి వన్యప్రాణుల జీవనానికి ముప్పు ఏర్పడింది. రాత్రి వేళల్లో అనుకోని అలజడితో నెమళ్లు ఆగమాగమై అనేక కాలనీల్లో ఇండ్లపై వచ్చి వాలుతున్నాయి. తద్వారా రక్షిత ఆవాసాలు కోల్పోయి నెమళ్లకు భద్రత లేకుండా పోతోంది. వాగు అవతలి వైపు ఏర్పడిన పలు వెంచర్లలో ఈ మధ్య కాలంలో కుక్కల దాడికి గురై నెమళ్లు బెదిరిపోతున్నట్లుగా చెబుతున్నారు. వ్యవసాయానికి, గ్రామీణ జీవనానికి కీలకమైన పులాంగ్, పాంగ్రా వాగులు ప్రస్తుతం నగరవాసులకు, నెమళ్లకు పెద్ద దిక్కుగానే నిలుస్తున్నాయి. మనిషి మనుగడకు ముప్పు లేకపోగా మూగ జీవాలకు ఏర్పడిన ఈ సమస్యను నగరపాలక సంస్థ, ఇరిగేషన్ శాఖ, అటవీ శాఖలు సంయుక్త కార్యాచరణతో కాపాడాలని నగర ప్రజలు, వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

### నెమళ్ల భద్రతకు చర్యలు చేపడతాం..


జాతీయ పక్షి నెమళ్ల భద్రతపై తప్పకుండా సంరక్షణ చర్యలు చేపడతాం. పులాంగ్ వాగు వెంట నెమళ్ల గుడ్ల సంరక్షణ, నెమళ్ల సంచారానికి ఏర్పాట్లు చేస్తాం. త్వరలోనే పులాంగ్ వాగు వెంట సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేస్తాం. జాతీయ పక్షిని వేటాడడం క్రూరమైన చర్య. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

**- వికాస్ మీనా,**
**అటవీ శాఖ అధికారి, నిజామాబాద్ జిల్లా**

## అన్నదాతలను పట్టించుకోని

# కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతుల కష్టాల కన్నా అందాల పోటీలే ఎక్కువయ్యాయా?
- ధాన్యం కొనేవారు లేక గోస పడుతున్న కర్షకులు
- అకాల వర్షాలకు తడుస్తున్న వడ్లు
- తడిసిన ధాన్యాన్ని కూడా సర్కారే కొనుగోలు చేయాలి
- రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్



మోర్తాడ్, మే 24: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ రెడ్డికి రైతుల కష్టాల కన్నా, అందాల పోటీలు ముఖ్యమయ్యాయా అని ప్రశ్నించారు. ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్ష నిర్వహించడానికి కూడా సమయం లేని సీఎం అందాల పోటీల విషయంలో ఎనిమిది సార్లు సమీక్ష నిర్వహించడాన్ని బట్టి చూస్తే రైతులపై ఎంతనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతుందన్నారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా, అవన్నీ ఉట్టిమాటలే అని శనివారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇంకా కల్లాల వద్ద, రహదారులపై ధాన్యపు రాసులు కుప్పలుకుప్పలుగా పడి ఉన్నాయని, ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు తడిసిపోతున్నాయని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వం కొనకపోయేసరికి అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

### కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్న రైతులు

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే ధాన్యం నీటిపాలు అవుతున్నదని మండిపడ్డారు. తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యం తీసుకోవడానికి అధికారులు ముందుకు రావడం లేదని రైతులు గోడు వెళ్లబోసుకుంటూ...గతంలో కేసీఆర్ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన సంగతిని గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. కల్లాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం కూడా రైస్ మిల్లులకు తరలించడానికి సకాలంలో లారీలు ప్రభుత్వం పంపకపోవడంతో ధాన్యం నీటిపాలు అవుతున్నదని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లులకు చేరిన ధాన్యం నుంచి ఎక్కువ మొత్తంలో తరుగు తీస్తూ రైతులకు తీవ్రనష్టం చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి క్వింటాలుకు రూ.500బోనస్ త్వరగా అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నష్టపోతున్న సజ్జలు, ఇతర పంటల రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు.

## రుద్రూర్‌లో 'కమ్యూనిటీ కాంట్రాక్ట్'

- జేఎన్‌సీ కాలనీలో సోదాలు
- సరైన ధ్రువపత్రాలు లేని 97 ద్విచక్రవాహనాలు స్వాధీనం

రుద్రూర్, మే 24: సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో శనివారం సాయంత్రం ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ముగ్గురు ఎస్సైలు, 60 మంది సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇండ్లలో సోదాలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 97 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో భాగంగా ఓ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి వద్ద 40 క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహన దారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రుద్రూర్, బోధన్ సీఐలు కృష్ణ, వెంకట నారాయణ, బోధన్ ఎస్సైతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

## ఒకేసారి మూడు నెలల రేషన్

### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



కంఠేశ్వర్, మే 24 : మూడు నెలల రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం కోటాను రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులు ఒకేసారి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, రేషన్ డీలర్లు మూడు మాసాల కోటాను దిగుమతి చేసుకుని సకాలంలో బియ్యం కోటా పంపిణీ చేయాలని సూచించారు. జూన్ 1 నుంచి 30 లోపు పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. బియ్యం పంపిణీలో అవకతవకలు, అలసత్వానికి తావిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు, వరదలు, నిల్వ సమస్యలు తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. ఏకకాలంలో మూడు నెలల పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకులు సక్రమంగా తరలించేలా బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

## ప్రాజెక్టులకు స్వల్పంగా పెరిగిన వరద

మోర్తాడ్/నిజాంసాగర్, మే 24: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి శనివారం స్వల్పంగా వరద పెరిగింది. శుక్రవారం 2,500 క్యూసెక్కుల వరద రాగా శనివారం 2,789 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1061.50 అడుగుల (11.965టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నది. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 321 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి శనివారం 1,160 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని ప్రాజెక్టు ఏఈఈ శివ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 5.668 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్ట్

## స్పందించారు.. తాగునీరు అందించారు..



పెద్దమల్లారెడ్డి నాల్గో వార్డు కాలనీవాసులకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

భిక్కనూరు, మే 24 : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామం నాల్గో వార్డులో నాలుగురోజులు కుళాయి నీళ్లు రాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారు కాలనీశివారులో నిర్మించిన పశువుల తొట్టి వద్ద ఏర్పాటు చేసిన కుళాయి నుంచి నీటిని బిందెలు, బకెట్ల ద్వారా సైకిళ్లపై తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు ఎదుర్కొటున్న నీటి ఇబ్బందులపై నమస్తే తెలంగాన దినపత్రికంలో 'పెద్దమల్లారెడ్డిలో నీటి కష్టాలు' శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. నాల్గోవార్డులో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. వాటర్ ట్యాంకుకు సరఫరా చేసే పైప్ లైన్ లీకేజీని గుర్తించి సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నారు.

## ధాన్యం కొనాలని రోడ్డెక్కిన అన్నదాతలు

20 రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని ఆగ్రహం

భిక్కనూరు, మే 24 : అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలో రైతులు శనివారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. రోడ్డుపై తడిసిన ధాన్యాన్ని పోసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట కోసి 20 రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని తూకం వేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అకాల వర్షాలకు వడ్లకు మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదని భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు, విండో చైర్మన్ భూమయ్య, సిబ్బంది రాస్తారోకో చేస్తున్న రైతుల వద్దకు తూకం మిషన్లు తీసుకువచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రవీందర్, రైతులు లింగం, ఆంజనేయులు, రమేశ్, మహేశ్, భూపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరు మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

## జిల్లాలో మోస్తరు వర్షం

రుద్రూర్/ మోర్తాడ్, మే 24 : ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల వద్ద వడ్లు తడిసిపోయాయి. రోడ్లన్నీ జలమయం కాగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుద్రూర్ మండలం అంబం గ్రామానికి చెందిన కౌలేడి పాపవ్వ నివాసపు ఇల్లు కూలింది. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో పాపవ్వ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇల్లు లేక నిరాశ్రయురాలైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నది. మండలకేంద్రంలోని పశువైద్య కేంద్రం ఆవరణలో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారింది.

### దెబ్బతిన్న సజ్జ పంట

మోర్తాడ్ మండలంలో అకాల వర్షాలకు సజ్జపంట పూర్తిగా దెబ్బతిన్నది. వర్షం కారణంగా సజ్జకంకి నుంచి ధాన్యం రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. కోతకు వచ్చిన సమయంలో పంట దెబ్బతినడం, పంట కోసిన వారి ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఒక్క దోన్‌పాల్ గ్రామంలోనే దాదాపు 40 ఎకరాల్లో సజ్జ పంట దెబ్బతిన్నది. అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని, తడిసిన సజ్జ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయురాలైన పాపవ్వ



## రెండో పెండ్లికి సిద్ధపడ్డాడని..

# తండ్రిని చంపిన తనయుడు

### లింగంపేట మండలం అయ్యపల్లి తండాలో ఘటన

లింగంపేట, మే 24: మండలంలోని అయ్యపల్లి తండాలో దారుణం చోటుచేసుకున్నది. తండ్రిని ఓ కుమారుడు గొడ్డలితో నరికి హత్య చేశాడు. తండ్రి రెండో వివాహానికి సిద్ధపడడంతో కుమారుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తండావాసులు తెలిపారు. ఘటనకు సంబంధించి వివరాలు .. తండాకు చెందిన దేవసోత్ ఫకీరా(46)కు ఫంగీతో వివాహమైంది. వీరికి కొడుకు ప్రకాశ్ నాయక్‌తోపాటు కూతురు ఉన్నది. కూతురు వివాహం కాగా, కుమారుడి వివాహం చేయాల్సి ఉంది. అయితే ఫకీరా పర్మళ్ల తండాకు చెందిన మరో మహిళతో రెండో వివాహం చేసుకోవడానికి సిద్ధమవగా కుమారుడు ప్రకాశ్ నాయక్ అడ్డుకున్నాడు. కుమారుడి వివాహం చేయకుండా తండ్రి చేసుకోవడానికి సిద్ధపడడంపై తరచూ ఇద్దరి మధ్య ఏడాదికాలంగా ఘర్షణ చోటుచేసుకునేది. ఘర్షణ పడిన ప్రతిసారి బంధువులు, కుటుంబీకులు సముదాయిస్తూ వచ్చారు. వీరు కొంతకాలం క్రితం కొత్త ఇంటిని నిర్మించుకొని అందులో ఉంటున్నారు. శనివారం రాత్రి సైతం తండ్రి, కొడుకు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో గ్యాస్ సిలిండర్‌కు నిప్పంటించి ఇంటిని పేల్చేస్తానని ఫకీరా బెదిరించడంతో కోపోద్రిక్తుడైన కుమారుడు ప్రకాశ్ గొడ్డలితో తండ్రిపై దాడిచేశాడు. దీంతో తలకు తీవ్రగాయాలై ఫకీరా అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు.